# ఈర్ష్య

నాకు ఈర్ష్య లేదు.

ఈ విషయాన్ని నేను గర్వంగా చెప్పడం లేదు. ఎందుకంటే అసలిది గర్వపడాల్సిన లక్షణమా కాదా అన్న విషయంలో నాకు సందేహాలున్నాయి.

ఇంకా చెప్పాలంటే నా ఇబ్బందులన్నిటికీ కారణం అసలు ఈ లక్షణమేనా అన్న అనుమానం కూడా నాకీమధ్య కలుగుతోంది.

నేను ఎవరికీ తీసిపోనన్న అహంభావమో, ఆత్మ విశ్వాసమో నాకుండడమే నాకు ఈర్ష్య లేకపోవడానికి కారణమని నాకు తెలుసు. ఇంకొకరికన్నా నేను తక్కువగా ఉన్నానన్న భావన నాకు లేనప్పుడు, ఆ విషయాన్ని నేను ఒప్పుకోనప్పుడు నాకు ఈర్ష్య ఉండేందుకు అవకాశం లేదు కదా!

చాలా సహజమైన ఈ విషయానికి... నేనేమీ ప్రయత్నించి సాధించని లక్షణానికి నేను గర్వపడడమెందుకు? అందుకే నాకు ఈర్ష్య లేనందుకు నాకు గర్వం లేదు.

అయితే నాకు ఈర్ష్య లేనందుకు నేను సంతోషించేమాట మాత్రం నిజం. ఆ లక్షణాన్ని ఎప్పటికీ వదులుకోకూడదన్న నిర్ణయం నాకుండడమూ నిజం.

అది నాకిచ్చే సంతృప్తిని నేను లెక్కకట్టలేను. కానీ ఆ లక్షణాన్ని వదులుకున్న మరుక్షణం నేను పొందే అసంతృప్తిని మాత్రం నేను ఊహించగలను. అందుకే ప్రాణం పోయినా సరే నేను వదులుకోలేని లక్షణం అది!

నాకు ఈర్ష్య లేదన్న విషయం నాకు ఇంత ఖచ్చితంగా తెలిసినా... దానివల్ల దొరికే సంతృప్తినంతటినీ నేను ఒక పక్క ఆనందిస్తున్నా... మరోపక్క అదే 'ఈర్ష్య' వల్ల నాకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఒక్క క్షణం ఆగి నా జీవితాన్నంతా పరిశీలించుకుంటే నా ఆనందాలన్నిటికీ మూలం ఆ మాట చుట్టూనే ఉంది. చిత్రంగా నా బాధలన్నిటికీ మూలం కూడా ఆ పదం చుట్టూనే ఉంది.

చక్కగా చదువుకుంటూ ఫస్ట్‌మార్కులు తెచ్చుకుంటూన్న నా చదువు ఆగిపోయినప్పుడు... నా కన్నా తక్కువ మార్కులు తెచ్చుకునే నా క్లాసుమేట్లూ, జూనియర్లూ నా కళ్లముందే ఇంజనీర్లూ, డాక్టర్లూ అయిపోతున్నప్పుడు నేను ఈర్ష్య పడలేదు. ఒక చిన్న ఉద్యోగంలో చేరిపోయి, కాస్తంత వెసులుబాటు రాగానే ప్రయివేట్‌గా చదివి ఇంజనీర్నయ్యాను.

ఆ చిన్న వయసులో కూడా ఈర్ష్య నన్ను దరిచేరలేదని గుర్తు చేసుకున్నప్పుడు, నన్ను నాశనం చేయలేదని అర్థం చేసుకున్నప్పుడు నాకు చాలా ఆనందంగా ఉంటుంది.

ఉద్యోగమూ అంతే. చదువులో ఎన్ని తెలివితేటలున్నా... మంచి ఉద్యోగమేదో తెలుసుకునే అవగాహన...దానికోసం ప్రయత్నం చేసే ఆలోచన లేకపోవడం వల్ల కావచ్చు... ఆ రకమైన గైడెన్స్ ఇచ్చేవాళ్లు నాకెవరూ ఉండకపోవడం వల్లా కావచ్చు... నా చదువుకు తగిన ఉద్యోగం నాకు మొదట్లో రాలేదు.

నేనింకా ఓ చిన్న ఉద్యోగంలో అవస్థపడుతుండగానే నా స్నేహితురాలికి నాకన్నా నాలుగు రెట్లు ఎక్కువ జీతంతో ఒక మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది.

ఆ రోజు నాకు బాగా గుర్తుంది... నా స్నేహితురాలు ఉద్యోగంలో చేరిన కొద్ది రోజులకి మా ఇంటికి వచ్చింది.

అమ్మ మా ఇద్దరికీ అన్నం పెడుతూ తన ఉద్యోగం వివరాలడిగింది. తన జీతం గురించీ, ఇతరత్రా బెనిఫిట్ల గురించీ చెప్పగానే, నా వైపు తిరిగి "నీకెప్పుడొస్తుందో అలాంటి ఉద్యోగం!" అంది అమ్మ.

నాకు ముద్ద మింగుడు పడలేదు. అమ్మ మాటా మింగుడు పడలేదు.

'ఎందుకు! ఎందుకిలా అంది అమ్మ!' అని చాలాసేపు గింజుకున్నాను.

ఆ అమ్మాయి వెళ్లిపోయాక నువ్వలా అనడం నాకు నచ్చలేదని అమ్మకి చెప్పాను.

అమ్మ నేను ఆ అమ్మాయి ముందు అవమానపడ్డాననుకుంది. "నిజమే నేను అలా అని వుండకూడదు" అని ఒప్పుకుంది. నన్ను బాధ పెట్టినందుకు తనూ బాధపడుతూ "నీకూ అలాంటి ఉద్యోగం వస్తుందిలే" అని ఊరడించబోయింది.

ఆ మాట నన్ను మరింత చిరాకు పెట్టింది. అయితే నా చిరాకుకీ, బాధకీ కారణం ఏమిటో నాకపుడు అర్థం కాలేదు. అమ్మ అన్నట్లు అవమానపడినట్లు ఫీలవడమేననుకున్నాను.

ఆ అమ్మాయి కన్నా తక్కువ ఉద్యోగంలో ఉన్నందుకు ఈర్ష్య పడకపోయినా ఆ మాటలని అమ్మ ఎత్తి చూపడంతో అవమాన. పడ్డాననుకున్నాను.

అమ్మ ఆ మాట అంటున్నప్పుడు నా స్నేహితురాలు నా వైపు చూసిన చూపు నాకు స్పష్టంగా గుర్తుండిపోయింది. అర్థం అవకుండానే నన్ను ఇబ్బంది పెట్టిన దాని భావం మాత్రం నాకు చాలా రోజుల తర్వాత కానీ తెలీలేదు.

అమ్మ అన్నట్లే నాకు రావలసిన రోజుకి నాకూ మంచి ఉద్యోగం వచ్చింది. అయితే అంతవరకూ ఇలాంటి ఇబ్బందికరమైన మాటలు చాలాసార్లు వచ్చాయి.

నా తోబుట్టువులందరూ నా కన్నా ముందు మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. సంబంధాలూ వాళ్లకి నాకన్నా మంచివి కుదిరాయి. ఇల్లూ వాకిలీ ఉన్న సంబంధాలు. మంచి ఉద్యోగాల్లో ఉన్న భర్తలు.

"మమ్మల్ని చూస్తే నీకు ఈర్ష్య!" అని వాళ్లు మొదటిసారి అన్నప్పుడు నేను నివ్వెరపోయాను.

"నాకు ఈర్ష్య అంటారేమిటి! నాకు ఈర్ష్య లేదు కదా!" అని చాలా నిజాయితీగా ఆశ్చర్యపోయాను.

నాకు ఈర్ష్య లేదని వాళ్లనెలా నమ్మించాలో తెలీక కుమిలిపోయాను. ఈర్ష్య పడుతున్నానని వాళ్లెందుకనుకుంటున్నారో అర్థం కాక బాధపడ్డాను.

నా స్నేహితురాలి చూపుకి అర్థం కూడా నాకపుడే బోధపడింది. "నన్ను చూసి ఈర్ష్య పడుతున్నావా!" అన్న అవహేళన ఉందా చూపులో!

అలాంటి అవహేళన ఎదురైనపుడు "లేదు, లేదు నాకు ఈర్ష్య లేదు" అనడం మరీ దుర్భరంగా ఉంటుంది.

"నేను సాధించినది సాధించడం ఎలాగూ చేతకాలేదు! కనీసం ఈర్ష్య పడడం కూడా చేతకాదా!" అనే అపహాస్యం ఎదురవుతుందనిపిస్తుంది.

కానీ ఇది నిజం. వాళ్లనుకుంటున్నట్లుగా వాళ్లంటే నాకు ఈర్ష్య లేదు. మరి వాళ్లెందుకు నాపై ఈ అపనింద మోపుతున్నారు?

ఈ ప్రశ్నకి సమాధానం నాకు షీలాతో పరిచయమయిన తర్వాత దొరికింది. ఇప్పుడాలోచిస్తే చాలా చిత్రంగా అనిపిస్తుంది. అంత చిన్న విషయం నాకు అన్ని రోజులు ఎందుకు అర్థం కాలేదా, అని! బహుశా బాధపడడమే కానీ దాని గురించి నేనెప్పుడూ సరిగా ఆలోచించకపోవడమే కారణం కావచ్చు.

ఈ రకమైన అపనిందని జీవితంలో కొన్నేళ్లపాటు ఎదుర్కొన్నాక నాకు మెల్ల మెల్లగా మాట్లాడే ఆసక్తీ, మనుషులలో కలిసే ఆసక్తీ చచ్చిపోయింది. నా స్వంత వాళ్లే నన్ను అపార్థం చేసుకుంటున్నారన్న బాధ నన్నెప్పుడూ తొలిచివేసేది. 'నాకు ఈర్ష్య' అనే అపవాదు నన్ను ఎంతగా బాధపెట్టిందంటే... కొన్నేళ్లపాటు అది నన్ను మూగగా మార్చేసింది.

షీలాది నాకు పూర్తిగా విరుద్ధమైన స్వభావం. ఖరీదైన చీరలూ, నగలూ... ప్రతినిత్యం సినిమాలూ... షికార్లూ... పార్టీలు... అవీ తనకున్న సరదాలు.

వారాంతాన్ని ఆనందంగా గడపడం ఎంత ముఖ్యమో... అదంతా సోమవారం లంచ్‌టైమ్‌లో నాకు చెప్పడమూ అంతే ముఖ్యంగా ఉండేది తనకి.

నా కయితే ఖాళీ సమయమంతా పుస్తకపఠనంతోనే గడుస్తుంది. ప్రతి వారమూ ఓ కొత్త పుస్తకం చదివిన అనుభూతి నాకున్నా దాని గురించి అసలు పుస్తకాలే చదవని షీలాతో చర్చించే అవకాశం లేదు.

అందుకే నేను మౌనంగా తను చెప్పేది వింటూ భోజనం చేసేదాన్ని. రెండేళ్లక్రితం పెళ్లికి కొనుక్కున్న బోలెడన్ని నగలు ఇంకా సరీగా పెట్టుకోకుండానే మళ్లీ ఓ నెల లక్ష రూపాయలు పెట్టి కెంపుల సెట్ కొన్నానని తను చెప్పినప్పుడు నాకు కొంత ఆశ్చర్యంగా అనిపించింది.

ఆ భావం నా మొహంలో కనిపించిందో లేదో తెలీదు. కానీ నేను పైకి ఏమీ అనలేదు. తను చెప్పింది విని ఊరుకున్నాను. ఆ మరుసటి నెల కొత్త డైమండ్ సెట్ పెట్టుకొని వచ్చింది.

వాళ్ల అమ్మ బ్రేస్‌లెట్ కొనిపెడతానంటే షాపుకి వెళ్లడం... తీరా అక్కడికి వెళ్ళాక డైమండ్ సెట్ బాగా నచ్చడం... వెంటనే క్రెడిట్‌కార్డు ఉపయోగించి కొనేయడం... ఇదంతా తను వర్ణించి చెప్తుంటే నేను మౌనంగా వింటున్నాను.

అప్పుడే వచ్చిన సంధ్య మా టేబుల్ దగ్గర కూర్చోబోతూ "కొత్త సెట్టా!" అని అడిగింది. షీలా పెదవులు బిగించి నవ్వుతూ అవునన్నట్లుగా కళ్లూ, తలా ఎగరేసింది.

"చా... లా బాగుంది" అంది సంధ్య చేత్తో పట్టుకుని చూస్తూ.

ఆ తరువాత సంధ్య దాని గురించి వేసే ప్రశ్నలని నేను ఆశ్చర్యంగా వింటూ కూర్చున్నాను. ఒక్క నగ గురించి అంతసేపు మాట్లాడవచ్చని తెలీని అమాయకత్వం నాకుందని నాకు మొదటిసారి అర్థమయింది.

వాళ్లు నా ఉనికే మర్చిపోయినట్టుగా చాలాసేపు నగల గురించీ... ఆ విషయంలో షీలాకున్న టేస్ట్ గురించీ మాట్లాడుకున్నారు.

అప్పుడు... ఆ సమయంలో నాకు నా సమస్య ఏమిటో అర్థమైనట్లు అనిపించింది. తను కొత్త డైమండ్ సెట్ గురించి ఉత్సాహంగా చెప్పినప్పుడు నేను ఏ మాత్రం స్పందన చూపకపోతే షీలా ఏమనుకునేందుకు అవకాశం ఉందో నాకర్థం అయింది. నా తోబుట్టువులు 'నాకు ఈర్ష్య' అని కామెంట్ చేయడం వెనుక కారణం నాకు అప్పుడు తెలిసింది.

మనుషులు సాధారణంగా ఏ విషయాలకి సంతోషిస్తారో... గర్వపడతారో... ఆ విషయాలని చూసి నేను ఉద్వేగపడను. దాన్నే వాళ్లు అసూయగా భావిస్తున్నారు. అవి నాకు లేనందువల్ల నేను పొందే అసంతృప్తిగా భావిస్తున్నారు.

కానీ నిజానికి నేను ఉద్వేగాన్ని, ఉత్సాహాన్ని చూపకపోవడానికి కారణం నాకు లేని వాటివల్ల అసంతృప్తి కాదు. నాకు ఉన్నవాటిపట్ల... నేను సాధించుకుంటున్న వాటిపట్ల నాకున్న సంతృప్తి.

ఆ విషయం నేను వారికి అర్థం చేయగలిగితే... నాకున్నది అసంతృప్తి కాదనీ... సంతృప్తి అనీ వారికి అర్థం చేయగలిగితే చాలు వాళ్ల అపార్థం తొలగిపోతుంది. నా సమస్యకి పరిష్కారం తెలియగానే నాలో కొత్త ఉత్సాహం నిండింది.

ఆ రోజు నుంచీ నేను మళ్లీ మునుపటిలా మాట్లాడటం మొదలుపెట్టాను. అవకాశం దొరికినప్పుడల్లా నన్ను ఉత్సాహపరిచే విషయాలేమిటో... నేను ఏర్పరచుకునే లక్ష్యాలేమిటో... జీవితాన్ని నేను అనుభవించే విధానాలేమిటో.. అందరితో షేర్ చేసుకోవడం మొదలుపెట్టాను.

అయితే దీనివల్ల ఇంకా పెద్ద ప్రమాదం ఉందనీ... నా తోబుట్టువులే కాక... స్నేహితులూ, పరిచయస్థులూ కూడా దీనివల్ల నాకు దూరమవుతారని నేను ఊహించలేదు.

కష్టాలు కొని తెచ్చుకునే ప్రపంచం ముందుకి వెళ్లి "నాకే కష్టాలూ లేవు. నేను చాలా ఆనందంగా ఉన్నాను" అని చెప్పే మనిషి పరిస్థితి ఏమవుతుందో నాకు అనుభవించాక గానీ తెలిసి రాలేదు.

నా సంతృప్తిని మాటల్లో చెప్పడం మొదలు పెట్టాక నా మీద వాళ్లు 'ఈర్ష్య' అనే అపవాదు వేయడం మానేశారు.

కానీ... కానీ నన్ను చూసి ఈర్ష్య పడడం మొదలు పెట్టారు.

ఈర్ష్య అన్న అపవాదు వేసే రోజుల్లో వాళ్ల మాటల్లో కొంతన్నా లాజిక్ ఉండేది. కానీ ఈర్ష్య పడడం మొదలు పెట్టాక ఆ కాస్త లాజిక్ కూడా లేకుండాపోయింది. వాళ్లు ఎప్పుడేం మాట్లాడ్తారో... ఎలాంటి నిష్ఠూరాలు వేస్తారో అర్థం కాకుండా పోయింది.

మళ్లీ మౌనాన్ని ఆశ్రయించాను నేను. ఈసారి బాధతో కాదు. భయంతో. అపవాదునన్నా ఎదుర్కోగలిగాను కానీ నిరాదరణని ఎదుర్కోవడం నా వల్ల కాలేదు. అపవాదులో అది నిజం కాదన్న ఊరట అన్నా ఉండేది. నిరాదరణలో, నిష్ఠూరాలలో అదీ లేదు. అందుకే ఏం మాట్లాడాలన్నా భయపడసాగాను నేను.

ఈర్ష్య ఉన్న వాళ్ల బ్రతుకు దుర్భరమని నాకు తెలుసు. కానీ ఈర్ష్య లేని వాళ్లని కూడా అది ఇంతగా బాధిస్తోందంటే... సంవత్సరాల తరబడి ప్రభావం చూపుతోందంటే కారణం ఏమిటి?

ఈ రోజు నిజం మాట్లాడటానికీ, సంతృప్తిగా సంతోషంగా కనబడటానికీ కూడా నేను జంకుతున్నానంటే కారణం ఏమిటి? నా వాళ్ల నిరాదరణ అనే ఆయుధంతో అది నన్ను భయపెడుతోంది. నేను దానికి లోబడకపోయినా... నా వాళ్లని అది లొంగదీసుకుని తద్వారా నన్ను సాధించాలనుకుంటోంది.

నిజం! కొన్నాళ్లుగా నేను సంతోషంగా కనబడడానికి కూడా భయపడుతున్నాను. ఒక అందమైన ముగ్గు వేసో, ఓ మంచి పుస్తకం చదువుకునో, మంచి పద్యం పాడుకునో, మల్లెలు జడలో తురుముకునో మురిసిపోయే నేను... ఆ మెరుపు నా

మొహంలో కనబడకుండా మాత్రం జాగ్రత్త పడుతున్నాను. నా తెలివితేటలనీ, జ్ఞానాన్నీ, నేను సాధిస్తున్న విజయాలనీ దాచుకుంటున్నాను.

ఇది చాలా దుర్భరంగా ఉంది. కానీ ఇంతకంటే మార్గమేమిటో తెలియడం లేదు.

నా ఆలోచనలని బ్రేక్ చేస్తూ హాల్లోనుంచి గొడవ వినబడింది. "నువ్వు ఫూల్‌వి. అంటే కాదు. నువ్వే ఫూల్‌వి" అంటూ వాదించుకుంటున్నారు గౌరవ్, ప్రజ్ఞా.

'ఏమయ్యిందంటూ నేను వాళ్ల దగ్గరికి వెళ్లగానే... "చూడమ్మా! అన్నయ్య ఇంతబాగా బొమ్మవేసి.. రేపు స్కూల్లో మొత్తం నేను వేయలేదు. కొంచెం మా మమ్మీ హెల్ప్ చేసింది అని చెప్తానంటున్నాడు" అంది ప్రజ్ఞ.

నేను వాడి చేతిలోని షీట్ చూశాను. సోలార్ సిస్టమ్ చాలా బాగా వేశాడు. హెల్ప్ చేయడం కాదు కదా నిజంగా నేనే వేసినా అంత బాగా వేయలేనేమో!

"ఎందుకు గౌరవ్!" అని నేను కారణం అడగబోయేలోపు...

"దీనికేం తెలీదమ్మా! నా ఫ్రెండ్సెవరికీ డ్రాయింగ్ రాదు. నేనింత బాగా వేశానంటే వాళ్లు ఫీల్ అవుతారు. నాతో సరిగా మాట్లాడరు. అందుకే నేనే ఓన్‌గా వేశానని చెప్పను" అన్నాడు గౌరవ్.

నేను నివ్వెరపోయాను. నాకే అలవికాని సమస్యతో ఎనిమిదేళ్ల నా బిడ్డ పోరాడుతున్నాడనుకుంటే బాధతో నా గుండె వణికింది.

దెబ్బతిన్న పిట్టలా సోఫాలో కూలబడ్డాను.

"అయితే అబద్దం చెప్తావా!" అంది ప్రజ్ఞ వదిలిపెట్టకుండా.

"మరేం చేయాలి?" అన్నాడు గౌరవ్ షీట్ మడిచి దాచుకుంటూ చిన్న బోయిన గొంతుతో.

సమాధానం తెలీని నేను క్షణం క్రితం నేను వేసుకున్న ప్రశ్ననే మరోసారి వేసుకున్నాను. "అవును, మరేం చేయాలి!"

"ఏం చేయక్కర్లేదు. అబద్ధం కూడా చెప్పక్కర్లేదు. ఎవరూ మాట్లాడకపోతే ఎంత అన్‌హాపీగా ఉంటుందో... నిజం చెప్పకపోతే కూడా అంతే అన్‌హాపీగా ఉంటుంది" ప్రజ్ఞ నోట్లో నుంచి పదునుగా వచ్చిన ఆ మాటలు శరాఘాతాల్లా తాకాయి నన్ను. నా లోపం నాకు అద్దంలో చూసినట్లు అర్థం అయింది.

అవును, ఈర్ష్యని ఎదుర్కొనే ప్రయత్నంలో మనం అబద్ధాలాడితే, నిజాన్ని దాస్తే... మన వ్యక్తిత్వాన్ని మనం మార్చుకున్నట్లే. మనం ఓడిపోయినట్లే.

నాలోని శక్తంతా ఎవరో లాగేసినట్లు ఒక్కక్షణం నా మొహం పాలిపోయింది. కానీ మరుక్షణమే వెలుగుతో నిండింది.

నీళ్లు తిరిగే కళ్లతో ప్రజ్ఞని దగ్గరికి లాక్కుని ముద్దు పెట్టుకున్నాను. నా అభిప్రాయం కోసం చూస్తూ ఎదురుగా నిలుచున్న గౌరవ్ వైపు చూసి తల ఊపాను.

ఈర్ష్యని జయించడమంటే ఈర్ష్య పడకపోవడమే కాదు. ఈర్ష్యకి భయపడకపోవడం కూడా.

రచనాకాలం : 2008